బహురూపాల్లో.. వాహన సేవలు

రథోత్సవం

మూషికాసురుని సంహారణకు వినియోగించే రథంపై ఏడో రోజున స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. అలాంటి రథోత్సవాన్ని తిల కిస్తే సకల దోషాలు పరిహరిస్తాయని భక్తుల విశ్వాసం.

- సెప్టెంబర్ 7 నుంచి కాణిపాక బ్రహ్మోత్సవాలకు ముహూర్తం
- చవితి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- పలు వాహనసేవల్లో కనువిందుచేయనున్న గణనాథుడు



కాణిపాకం: కాణిపాక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం సర్వం సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాల నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. ఆలయం ఉత్సవానికి ముస్తాబవుతోంది. పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదిదేవుడు వివిధ సేవల్లో ఊరేగనున్నారు. భక్తులకు బహురూపాల్లో కనువిందు చేయనున్నారు. ఈనేపథ్యంలో ఆ వాహనసేవలు ఎలా నిర్వర్తిస్తారో చూద్దాం..

ఆరంభ సేవ...

వినాయక చవితి మరుసటి రోజు నుంచి శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం అవుతాయి. తొలిరోజు ధ్వజారోహణం స్వామివారి వాహనమైన మూషిక చిత్రపటాన్ని ఆలయ ధ్వజారోహణంపై ఎగురవేసి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరిగేలా దేవతలు ఆశీర్వదిస్తారని ప్రతీతి.

ఏకాంత సేవ..

బ్రహ్మోత్సవాలు పూర్తయిన తర్వాత ధ్వజావరోహణాన్ని అంగరంగ వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కార్యక్రమం తర్వాత స్వామివారి మూల విగ్రహానికి పాయసం, వడలతో అభిషేకం నిర్వహిస్తారు. దీనిని వడాయిత్తు ఉత్సవం అంటారు. అనంతరం స్వామివారికి ఏకాంతసేవను నిర్వహిస్తారు



అశ్వవాహన సేవ...

మూషికాసురుని సంహారం తర్వాత బ్రహ్మ మానస పుత్రికలైన సిద్ధి, బుద్ధిలతో స్వామి వారికి కల్యాణోత్సవం చేస్తారు. అనంతరం స్వామివారు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇస్తారు.

హంస వాహన సేవ



మొదటి రోజు రాత్రి హంస వాహనంపై విహరిస్తూ దేవదేవేరులు భక్తులకు దర్శనం ఇస్తారు. హంస వాహన సేవలో స్వామిని దర్శించుకుంటే మానవుల్లో సద్గుణాలు అలవడుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

మయూర వాహన సేవ



రెండవ రోజు స్వామివారు మయూర వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇస్తారు. మనిషిలో మంచిని గుర్తించేందుకు నెమలి వాహన సేవను చూసి తరించాలంటూ పురాణాలు చెబుతున్నాయి.

మూషిక వాహన సేవ



మూషికాసురుడిని స్వామి వారు వధించి, అతని కోరిక మేరకు మూషికాన్ని తన వాహనంగా చేసుకొని మూడోరోజు ఊరేగుతారు. ఈ వాహనసేవలో పాల్గొంటే గర్వాన్ని పోగొట్టి మంచి మార్గంలో నడిపిస్తారని నమ్మకం.

శేష వాహనసేవ




నాగలోకానికి అధిపతి నాగరాజు. అలాంటి శేషవాహనంపై వినాయకుడు నాల్గో రోజు భక్తులకు దర్శనం ఇస్తారు. ఉత్సవాలలో చిన్న, పెద్ద శేషవా హనాలపై ఉదయం, రాత్రి వేళలో పురవీధుల్లో ఊరేగుతారు.

వృషభ వాహన సేవ



ఐదో రోజు ఉత్సవంలో వినాయకుడు వృషభ వాహనంపై కొలువుదీరి విహరిస్తారు. ఈ సేవలో పాల్గొంటే స్వామి వారి కరుణా కటాక్షాలతోపాటు శివుని అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

గజవాహన సేవ



ఆరో రోజు ఏనుగు తలను తన శిరస్సుగా మార్చుకొని స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. అలాంటి గజవాహనంపై స్వామివారిని భక్తులు దర్శించుకుంటే ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

క్లుప్తంగా

చిత్తూరు సహాయ కమిషనర్‌గా ప్రసాద్



చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్‌గా అవినేని ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన మునిసిపల్ కమిషనర్ల బదిలీల్లో నెల్లూరు కార్పొరేషన్‌లో ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న ప్రసాద్‌ను చిత్తూరుకు బదిలీ చేశారు. చిత్తూరులో బాధ్యతలు తీసుకున్న ఆయన రెవెన్యూ అధికారులతో పలు విషయాలపై సమీక్షించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



నివాళులర్పిస్తున్న ఇందుమతి

గుడిపాల: గుడిపాల మండలంలోని 197రామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, రిటైర్డ్ లైన్‌మన్ సుబ్రమణ్యంయాదవ్ అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి తెలిపారు. శనివారం ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ కూడా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పీవీకేఎన్ విద్యార్థికి అభినందనలు



వినయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పీవీకేఎన్ విద్యార్థి వినయ్‌కుమార్ క్రీడల్లో ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఈమేరకు శనివారం ఆ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలో బీకాం చదువుతున్న వినయ్‌కుమార్ నేపాల్‌లో జరిగే టీ20 క్రికెట్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపిక కావడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థి వినయ్‌ను అభినందించారు. బీకాం కోర్సు ఇన్‌చార్జ్ డా.శరవణ, పీడీ లోకేష్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యం



ఫ్యామిలీ డాక్టర్‌లో డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. తుమ్మిందపాళ్యం గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థులకు వైద్యసేవలను అందించారు. వైద్య సిబ్బంది చంద్రశేఖర్, రాజేశ్వరి, నందిని, నిరోషా, తేజ పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపు



కన్నయ్యను సన్మానిస్తున్న ఎంఈఓ, టీచర్లు

బంగారుపాళెం: విధి నిర్వహణలో ఉద్యోగులు చేసిన సేవలే కలకాలం గుర్తుండిపోతాయని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని కొత్తవెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న కన్నయ్య శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా బంగారుపాళెం ఎంపీడీఓ సమావేశ భవనంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ 34 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా కన్నయ్య చేసిన సేవలు ఎనలేనివన్నారు. అనంతరం కన్నయ్యను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

దోమల నియంత్రణకు చర్యలు

తవణంపల్లె: గ్రామాల్లో దోమల వ్యాప్తిని నియంత్రించడానికి చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. శనివారం మండలంలోని నలిశెట్టిపల్లె, దిగువ మోదలపల్లె పంచాయతీల్లో దోమలను పూర్తిగా నాశనం చేయడానికి ఫాగింగ్ చేసినట్లు వివరించారు. వర్షాకాలంలో పల్లెల్లో లార్వాల ద్వారా దోమలు అధికం కావడంతో పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. డ్రైడే పాటించి నీరు నిల్వ ఉన్న తొట్టెలను శుభ్రం చేయించినట్లు తెలిపారు. గ్రామాల్లోని వీధుల్లో సాయంత్రం ఫాగింగ్ చేయిస్తున్ననట్లు చెప్పారు.

నేడు కుంభాభిషేకం

ఐరాల: మండలంలోని శ్రీరాంనగర్, చిన్నవెంకటపల్లెలో ఆదివారం నూతనంగా నిర్మించిన శ్రీరామకృష్ణ మందిర కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాజమండ్రి శ్రీరామకృష్ణామిషన్ శ్రీమతి శ్రీశశికాంతనంద మహారాజ్ వారిచే శ్రీరామకృష్ణ మందిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు గణపతి వాస్తు శాంతి హోమం, 8 గంటలకు శ్రీ భగవాన్ శ్రీరామకృష్ణుల మందిర సంప్రోక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 గంటలకు గురుదేవుల పూజా హోమం, 10 గంటలకు నగర సంకీర్తనం, స్వామివారి ఊరేగింపు, 11 గంటలకు స్వామీజీ ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి హారతితో కుంభాభిషేకం ముగియనున్నట్లు వివరించారు.

శిఖండి చిత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో చిత్ర బృందం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం శిఖండి సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. చిత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ కేకే ఫిలిమ్స్ సమర్పణలో కోడి కిషోర్ దర్శకత్వం వహిస్తూ శిఖండి సినిమాలో ప్లాస్టిక్ మహమ్మారిని రూపుమాపాలనే నేపథ్యంలో ఈ సినిమా చిత్రీకరణ సాగిందన్నారు. త్వరలో సినిమాను తెరపైకి తీసుకొస్తామన్నారు. సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. నటీనటులు చంద్రశేఖర్, గంజి రామమూర్తి, ఏకే మురుగేషన్, శంకర్, టీవీ శ్రీనివాసులు, విజయకుమార్, పాండురంగన్, నాగ కుమార్, ఉదయ్‌కిరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో మొక్కలు నాటండి

యాదమరి(పూతలపట్టు): ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో మొక్కలు నాటాలని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. శనివారం మండలంలోని దాసరాపల్లి గ్రామ పంచాయతీలో వనం–మనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ సంస్థల్లో, స్థలాల్లో కొబ్బరి, మామిడి, అల్లనేరేడు, నిమ్మ మొక్కలను నాటించాలని సూచించారు. సహాయపతక సంచాలకులు సుబ్రమణ్యం, ఎంపీడీఓ శివరాజు, తహసీల్దార్ పార్థసారథి, ఏపీఓ బాల పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకర ప్రసవం

ఐరాల: పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర ప్రసవానికి మార్గం సుగమం అవుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని నెల్లిమంద పల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ పోషకాహారం లోపం వల్ల రక్తహీనత లాంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఫలితంగా ఆరోగ్యకర బిడ్డకు జన్మనివ్వడం కుదరదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర బిడ్డకు జన్మ ఇవ్వచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి

ఇంటర్ జోనల్స్ క్రీడోత్సవాలు ప్రారంభం

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఇంటర్ జోనల్స్ క్రీడోత్సవాలను ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జోనల్ క్రీడలకు సంబంధించి నియమ, నిబంధనల పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజుతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి, జిల్లా స్థాయి పోటీల్లో నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. డీవైఈఓ చంద్రశేఖర్, ఎంపీడీఓ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, డీఈఓ

వేధింపులు మానుకోకుంటే ఆందోళన



మాట్లాడుతున్న నాగరాజు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రీన్ అంబాసిడర్, పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలపై వేధింపులు మానుకోకుంటే రాజకీయ పోరాటం తప్పదని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులపట్ల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో కూటమి ప్రజాప్రతినిధులు గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న సిబ్బందిని తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆ ప్రయత్నాలను విరమించుకోవాలని తెలిపారు. లేని పక్షంలో సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం వేస్తే కూటమి సర్కారుకు తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి వెంకటరమణారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో రికార్డులను ఆయన పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న బోధనా పద్ధతులను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై సిబ్బందిని అడిగి ఆరాతీశారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా డ్రాపౌట్లను గుర్తించి కేంద్రాలలో చేర్పించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటరమణారెడ్డి

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

- ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు వర్ష సూచన ఉన్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. తడిసిన కరెంట్ స్తంభాలు, స్టార్టర్లు, మోటార్లను ముట్టుకోరాదన్నారు. లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదని సంబంధిత సిబ్బందికి వీటిపై సమాచారం ఇవ్వాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, పార్కులు, స్టేడియంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదన్నారు. నివాసాల్లో స్విచ్‌లను తడి చేతులతో తాకరాదన్నారు. ఇంటి బయట లైట్లను నీటిలో తడవకుండా చూసుకోవాలని చెప్పారు. పిల్లలను కరెంటు వస్తువులను తాకకుండా చూసుకోవాలని తెలిపారు. బట్టలను ఇనుప తీగలపై వేయరాదని, వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాత వాడుకోవాలన్నారు. వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్‌మెషిన్, కంప్యూటర్ల స్విచ్‌లను ఆఫ్ చేయాలన్నారు. వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉందన్నారు. విద్యుత్ లైన్ క్రింద సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏదైనా డ్యామేజ్ అయితే సంబంధింత అధికారికి తెలపాలన్నారు.

నేలను వదిలి.. నింగికా?

- విషజ్వరాలతో అల్లాడుతున్న జనం
- మురుగునీటి కాలువల్లో విచ్చలవిడిగా దోమలు
- పడకేసిన పారిశుధ్యం.. అధికారుల చోద్యం





డ్రోన్‌తో దోమల మందు పిచికారీ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు, చిత్తూరులోని వెంగళరావు కాలనీ వద్ద కాలువలో నిలిచిపోయిన మురుగునీటి ప్రవాహం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గంలో విషజ్వరాలు చాపకింద నీరులా విజృంభిస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ ఆగిపోయిన మురుగునీటి కాలువల నుంచి దోమలు విచ్చలవిడిగా పురుడుపోసుకుంటున్నాయి. వీటిని నివారించడంలో అధికారులు చేపడుతున్న చర్యలు నేలను వదిలి నింగిలో సాము చేస్తున్నట్లు తలపిస్తోంది.

కార్పొరేషన్‌లో చర్యలేవీ..?

రెండు లక్షలకుపైగా జనాభా ఉన్న చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం పనిచేస్తోంది. నగరంలో పారిశుధ్య పనులతో పాటు వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ, దోమ కాట్ల నుంచి ప్రజలను రక్షించడానికి ఫాగింగ్, దోమ లార్వాలను అరికట్టడానికి ఆయిల్ బాల్స్ వేయడం, గంబూషియా చేపలను నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో వదలడం చేయాలి. కానీ నగరంలో అసలు ఫాగింగ్ చేస్తున్నారో లేదో కూడా ప్రజలకు అర్థంకాని పరిస్థితి. కానీ కార్పొరేషన్ రికార్డుల్లో మాత్రం దోమల నివారణకు ఏటా రూ.40 లక్షల వరకు ప్రజాధనం వెచ్చిస్తున్నట్లు నిధులు ఖాళీ చేస్తున్నారు. నగరంలోని గంగినేనిచెరువు, దుర్గానగర్ కాలనీ చెరువుల్లో గుర్రపుడెక్క మొక్కల్ని శుభ్రం చేయడానికి రూ.1.30 కోట్లను తప్పుడు బిల్లుల్లో చూపించి అధికారులే మింగేసినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేసే ప్రయత్నాలు మొదలుపెట్టిన అధికారులు.. వీటికి ఎంత మొత్తం బిల్లులు తయారుచేసి, నిధులు దిగమింగుతారో చూడాలి. క్షేత్ర స్థాయిలో పారిశుధ్య కార్మికులను పంపించి, పిచ్చి మొక్కలను నిర్మూలించడం, కాలువల్లో పూడికలు తీయించడం, మురుగునీరు నిల్వ లేకుండా చేస్తేనే దోమల వ్యాప్తి తగ్గిపోతుంది. అలా కాకుండా ప్రాణాంతకమైన డెంగీ జ్వరాలు వచ్చినపుడు ఆ ప్రాంతంలో రూ.50 విలువైన సున్నం చల్లి, రూ.వెయ్యి విలువచేసే బ్లీచింగ్ పౌడర్ వేసినట్లు లెక్కలు రాసుకోవడంలో ప్రజారోగ్యశాఖలో పనిచేసే కొందరు అధికారులకే చెల్లుతుంది. పారిశుధ్య పనులు బాలేదని చెప్పడానికి ప్రజలు ఫోన్ చేస్తే, అధికారులు ఫోన్ తీయడంలేదనే విమర్శలూ ఉన్నాయి.

పల్లెల్లో ఇలా..

ఇక గుడిపాల మండలంలో వసంతాపురం, కోకావాండ్లవూరు, చీలాపల్లె, 189–కొత్త పల్లె, చుక్కావారిపల్లె పంచాయతీల్లో విషజ్వరాల బారినపడ్డ వాళ్లు ఎక్కువగా ఉన్నారు. మండలంలోని 20కు పైగా పంచాయతీల్లో గత మూడు నెలలకుపైగా పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేసిన దాఖలాలులేవు. ఇక్కడున్న రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు సగటున 10–12 మంది జ్వరాలతో వచ్చి చికిత్స పొందుతున్నారు. చిత్తూరు గ్రామీణ మండలంలో 17 పంచాయతీలు ఉంటే.. ఎస్‌ఆర్.పేట, అనంతాపురం ప్రాంతాల్లో జ్వరాల బారినపడుతున్నారు. కేవలం విషజ్వరాలు, డెంగీ జ్వరాలు వచ్చినప్పుడు మాత్రమే పంచాయతీ అధికారులు సిబ్బందిని పంపించి పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. మిగిలిన సమయంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టడంలేదనే విమర్శలున్నాయి.



వసంతాపురంలో నిలిచిన మురుగునీరు

అన్ని చర్యలు తీసుకుంటున్నాం..

నగరంలో దోమల నివారణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. నీటి నిల్వ ప్రాంతాల్లో డ్రోన్‌ల సాయంతో మందులు పిచికారీ చేస్తున్నాం. ఫాగింగ్ కూడా ప్రారంభిస్తాం. పారిశుధ్యం బాలేకున్నా, దోమల వ్యాప్తి ఎక్కువగా ఉన్నా నాకు ఫోన్ (9849906673) చేయండి.

–డా.అనిల్‌కుమార్ నాయక్, ప్రజారోగ్యశాఖ అధికారి, చిత్తూరు

జానపద సంపదను కాపాడుకుందాం



మాట్లాడుతున్న మన సంస్కృతి కళా సంస్థ అధ్యక్షుడు సహదేవనాయుడు

ఐరాల: జానపద సంపదను సంరక్షించుకుంటూ భాషా సంస్కృతులను నిరంతరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మన సంస్కృతి కళా సంస్థ అధ్యక్షుడు రంగాని సహదేవనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం తిరుపతి మన సంస్కృతి కళాసంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద మాసోత్సవంలో భాగంగా విద్యార్థులకు జానపదం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద సంపద లేకుండా భాషాభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధి జరగవని, ఈ రెండింటి పుట్టుక జానపదం నుంచే మొదలైందన్నారు. పల్లె జనం నుంచి జాలువారిన లాలి పాటలు, జోల పాటలు, కోలాటం పండరీ భజన, చెక్క భజన పాటలు కనుమరుగు కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం జానపద గీతాలు, తెలుగు భాషా గురించి, భక్తి, భజన పాటలు ఆలపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోమల, సంస్థ ప్రధానకార్యదర్శి కలకట రెడ్డెప్ప, గాయకులు శ్రీదేవి, కళావేదిక వ్యవస్థాపకులు రాజశేఖర్, గౌరవ సలహాదారులు మనోహర్ పాల్గొన్నారు.